క్లుప్తంగా

దుస్తులు పంపిణీ

పాల్వంచ: పట్టణంలోని ఏ కాలనీలోని సీఎస్ఐ గ్రౌండ్‌లో మూడు రోజులుగా క్రీస్తు విజ్ఞాన సువార్త సభలు నిర్వహిస్తున్నారు. గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఏబీసీసీ తెలంగాణ డిప్యూటీ డైరెక్టర్ సంతోష్, ప్రిన్సిపాల్ బి.రవి చేతుల మీదుగా పాస్టర్లకు నూతన దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాస్టర్లు షాంపూరు నాగభూషణం, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' కూలి పెంచాలి



కూలీలతో మాట్లాడుతున్న సారంగపాణి

ఇల్లెందురూరల్: కొలతలతో సంబంధం లేకుండా ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలకు రోజుకు రూ.750 చెల్లించాలని ఇఫ్టూ జిల్లా కార్యదర్శి కొక్కు సారంగపాణి డిమాండ్ చేశారు. మండలంలోని విజయలక్ష్మీనగర్ గ్రామపంచాయతీలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలకు కల్పిస్తున్న సౌకర్యాలను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పెరిగిన ధరలకు అనుగుణంగా కూలీల వేతనం కూడా పెంచాలన్నారు. పనిప్రదేశంలో కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని కోరారు. గూగ్ల సదయ్య, తేజావత్ లాలు పాల్గొన్నారు.

21న గోదావరిఖనిలో ఐఎన్‌టీయూసీ మహాసభ



మాట్లాడుతున్న త్యాగరాజన్

సింగరేణి(కొత్తగూడెం): గోదావరిఖనిలో ఈనెల 21న నిర్వహించనున్న ఐఎన్‌టీయూసీ మహాసభకు కార్యకర్తలు తరలిరావాలని జనరల్ సెక్రటరీ సి.త్యాగరాజన్ పిలుపునిచ్చారు. కొత్తగూడెంలోని ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ.. మహాసభలకు ఐఎన్‌టీయూసీ జాతీయ నాయకుడు డాక్టర్ సంజీవరెడ్డి, సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ తదితరులు హాజరవుతారని తెలిపారు. ఈ సందర్భంగా సింగరేణి కార్మికుల సమస్యలపై చర్చించి పరిష్కారానికి కార్యాచరణ రూపొందిస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఏరియా, కార్పొరేట్ ఉపాధ్యక్షుడు ఎండీ.రజాక్, పీతాంబరం, నాయకులు ఆల్బర్ట్, విల్సన్, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

గంగమ్మ తల్లికి బోనాలు



బోనంతో వస్తున్న మహిళలు

జూలూరుపాడు: గుండెపుడి గ్రామంలో గురువారం యాదవ కులస్తులు గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. యాదవ సంఘం ఆధ్వర్యంలో పోడపోతుల కులస్తులు నాగమల్లు, యాదగిరి అమ్మవారికి పూజలు నిర్వహించారు. అనంతరం గంగమ్మతల్లికి బోనాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో పాపారావు, వేల్పుల గోపాలకృష్ణ, నాగరాజు, వెంకటేశ్వర్లు, అచ్యుతరావు, పిచ్చారావు, గంగయ్య, సత్యం పాల్గొన్నారు. ఈ సందర్భంగా యాదవ సంఘం గుండెపుడి గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గోరంట్ల పాపారావు, ఉపాధ్యక్షుడు కాలంగి వెంకటేశ్వర్లు, కార్యదర్శిగా వేల్పుల గోపాలకృష్ణ, సహాయ కార్యదర్శి నాగరాజులను ఎన్నుకున్నారు.

గోతులు తవ్వారు.. వదిలేశారు..



పూడ్చకుండా వదిలేసిన గోతులు

టేకులపల్లి: తాగునీటి సరఫరా కోసం గుంతలు తవ్వించిన అధికారులు వాటిని పూడ్చించడం మరిచారు. టేకులపల్లి మండలం ముత్యాలంపాడు క్రాస్‌రోడ్ పంచాయతీ పరిధిలోని శాంతినగర్‌లో నీటి సరఫరా కోసం పక్కనే ఉన్న గొల్లగూడెం ట్యాంకు నుంచి పైపులైన్ తీసుకోకుండా ఎక్కువ దూరంలో ఉన్న ముత్యాలంపాడు క్రాస్‌రోడ్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఉన్న మిషన్ భగీరథ ట్యాంకు నుంచి నీటి సరఫరా చేసేందుకు పనులు చేపట్టారు. ఇందుకోసం మూడు రోజుల క్రితమే దారి పొడవునా గోతులు తవ్వి, పైపులు వేశారు. కానీ ఆ గోతులను మాత్రం పూడ్చలేదు. ప్రజలు, పశువులు నడిచే మార్గంలో గోతులు ప్రమాదకరంగా ఉన్నాయి. ఉన్నతాధికారులు స్పందించి తక్షణమే గోతులను పూడ్చి వేయించాలని స్థానికులు కోరుతున్నారు.

ఎండ తీవ్రం.. వసతులు పూజ్యం

మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కరువయ్యాయి. నిత్యం వారు అసౌకర్యాల మధ్య పనులు చేస్తున్నారు. ఇటీవల ఎండ తీవ్రత పెరుగుతుండటంతో మరింత ఇబ్బంది పడుతున్నారు. ప్రథమ చికిత్స పెట్టెలు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, టెంట్లు, తాగునీరు అందుబాటులో లేక ఆందోళనకు గురవుతున్నారు. వేసవిలో కల్పించాల్సిన వసతులపై సంబంధిత అధికారులు దృష్టి సారించకపోవడంతో కూలీలకు అవస్థలు తప్పడం లేదు.



రొంపేడులో ట్రాక్టర్లలోకి మట్టి లోడ్ చేస్తున్న ఉపాధి కూలీలు

- పని ప్రదేశాల్లో కనిపించని కనీస సౌకర్యాలు
- అవస్థలు పడుతున్న ఉపాధి కూలీలు

ఇల్లెందురూరల్: మండలంలో ఉపాధి హామీ పథకంలో భాగంగా 8,055 జాబ్‌కార్డులు ఉన్నాయి. ఆయా జాబ్‌కార్డులలో కూలీల సంఖ్య 12,043. కానీ వారిలో ప్రస్తుతం 2,604 మంది మాత్రమే పనులకు హాజరవుతున్నారు. ప్రస్తుతం భానుడి భగభగల కారణంగా కూలీలు ఉదయం ఆరు గంటల నుంచే పనులకు హాజరవుతున్నారు. పది గంటల వరకు పనులు పూర్తి చేసి ఇళ్లకు చేరుకుంటున్నారు.

ప్రథమ చికిత్స కిట్లు కరువు...

గతంలో పని చేసే చోట ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉంచేవారు. అయోడిన్ సీసా, బ్యాండేజ్, దూది, కొన్నిరకాల మందులు ఉండేవి. ఎవరైనా గాయపడితే వెంటనే ప్రథమ చికిత్స అందించేవారు. కానీ చాలాకాలంగా ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉండటం లేదు. సమీపంలోని పీహెచ్‌సీ నుంచి అవసరమైన సామగ్రిని సేకరించి పనిప్రదేశంలో ఉంచాలని స్పష్టమైన ఆదేశాలు ఉన్నా ఉపాధి హామీ అధికారులు ఆ దిశగా దృష్టి సారించడం లేదు.

సొంతంగా కొనుక్కొని..

కూలీలకు ప్రభుత్వం నుంచి గడ్డపార, పార, తట్టలు వంటి వాటిని గతంలో పంపిణీ చేసేవారు. ఆ తరువాత వంద మస్టర్లు పూర్తి చేసిన కూలీలకు మాత్రమే పంపిణీ చేశారు. కానీ ప్రస్తుతం వాటిని ఎవరికీ పంపిణీ చేయడం లేదు. ఆయా పరికరాలు సానబెట్టడానికి నగదు ఇచ్చేవారు. ప్రస్తుతం ఆ ఊసే లేదు. ఉపాధి హామీ కూలీలు సొంతంగా పరికరాలు కొనుక్కొని పనులకు హాజరవుతున్నారు.

టెంట్లు జాడ లేవు..

ప్రస్తుతం ఎండలు మండుతున్నా పని ప్రదేశంలో కూలీలకు నిలువ నీడ కరువైంది. పనిప్రదేశంలో సేదతీరేందుకు గతంలో ఉపాధి కూలీలకు టెంట్లు ఇచ్చేవారు. క్షేత్రసహాయకులు వాటిని ప్రతీరోజు పని ప్రదేశానికి తీసుకొచ్చేవారు. ఇప్పుడవి ఎక్కడా కనిపించడం లేదు. గతంలో ఇచ్చినవి చిరిగిపోవడంతో పనికిరాకుండా పోయాయి. వాటి స్థానంలో గ్రీన్ నెట్లు ఏర్పాటు చేయాల్సి ఉన్నా ఇంత వరకు వాటిని ఏర్పాటు చేయలేదు. దీంతో కూలీలు ఎండలోనే పనులు చేసి, ఎండలో విశ్రాంతి తీసుకుంటున్నారు.

తాగునీటి సౌకర్యం ఉత్తమాటే..

ప్రస్తుతం సూర్యుడి తాపానికి ఇంట్లో ఉండే వారికే గడియకోసారి దాహమేస్తోంది. అలాంటిది మండుటెండలో మట్టి పని చేసేవారి పరిస్థితి. ఉపాధి హామీ కూలీలకు తాగునీటి సౌకర్యం కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారు. కూలీలు ఉదయమే పనికి వచ్చే సమయంలోనే వెంట మంచినీటి బాటిళ్లను తెచ్చుకుంటున్నారు. అవి పూర్తికాగానే అల్లాడుతున్నారు. పనిచేస్తున్న ముఠాలో నీటి కోసం ఒకరిని గ్రామంలోకి పురమాయించక తప్పడం లేదు. గతంలో ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా మంచినీటి సౌకర్యం ఏర్పాటు చేయగా ఆ తరువాత తాగునీటి కోసం ఒక్కో కూలీకి రోజుకు రూ.2 చొప్పున వారి వేతనాల్లోనే జమ చేస్తామని ప్రకటించింది. కానీ ప్రస్తుతం తాగునీటి సౌకర్యం కల్పించాల్సిన బాధ్యతను గ్రామపంచాయతీలకు అప్పగించింది. దీనికోసం ఒక్కో కూలీకి రోజుకు రూ.2.50 చొప్పున నిధులను గ్రామపంచాయతీ అకౌంట్లలో జమచేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. కానీ పని ప్రదేశాలలో అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పంచాయతీలు సైతం తమ బాధ్యతను విస్మరిస్తున్నాయి. ఎక్కడ కూడా పని ప్రదేశాలలో తాగునీటి సౌకర్యం మచ్చుకైనా కనిపించడం లేదు. ఫలితంగా కూలీలు పనిప్రదేశాలలో తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

తాగునీటి సౌకర్యం కల్పించాలి...



ఎండాకాలం కావడంతో కాసేపు పనిచేయగానే దాహం వేస్తోంది. ఇంటి నుంచి తెచ్చుకున్న నీళ్లు గంట వ్యవధిలోనే ఖాళీ అవుతున్నాయి. అధికారులు స్పందించి పని ప్రదేశంలో తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయాలి. అలిసిపోయినప్పుడు సేద తీరేందుకు నీడ కోసం గుడారాలు ఏర్పాటు చేయాలి.

– వాంకుడోత్ సీతమ్మ, ఉపాధి కూలీ, రొంపేడు

ప్రథమ చికిత్స కిట్లు ఇవ్వాలి...



మండుతున్న ఎండల్లో పని చేస్తున్నందున కూలీలు సొమ్మసిల్లి ప్రమాదాలకు గురయ్యే అవకాశాలు ఉన్నాయి. మట్టి పని అయినందున లోడింగ్ సమయంలో కొంతమంది స్వల్ప గాయాలకు గురవుతున్నారు. తక్షణం ప్రథమ చికిత్స చేసుకునేందుకు అధికారులు కిట్లు అందుబాటులో ఉంచాలి.

– అజ్మీర బాలాజీ, ఉపాధి కూలీ, రొంపేడు

చర్యలు తీసుకుంటాం...



ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఉపాధి హామీ కూలీలకు పని ప్రదేశాల్లో వసతులు కల్పించేలా చర్యలు తీసుకుంటాం. తాగునీటి సరఫరా బాధ్యతను గ్రామపంచాయతీలకు అప్పగించారు. ప్రథమ చికిత్స కిట్లను పీహెచ్‌సీల నుంచి సేకరిస్తున్నాం. నీడ కోసం దాతల సహాయంతో సౌకర్యాలు కల్పిస్తున్నాం.

– శంకర్, ఏపీఓ, ఎన్ఆర్ఈజీఎస్, ఇల్లెందు

అసంపూర్తిగా రోడ్డు నిర్మాణం

ఇల్లెందురూరల్: బాలాజీనగర్‌లో ఇటీవల సీసీ రోడ్డు నిర్మించారు. కానీ కాలువపై కల్వర్టు నిర్మించకపోవడంతో రహదారి ప్రమాకరంగా మారింది. ఇప్పటికే ఇక్కడ చాలా ప్రమాదాలు జరిగిన సందర్భాలు ఉన్నాయి. అధికారులు స్పందించి కల్వర్టు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.



కల్వర్టు నిర్మించాల్సిన ప్రాంతం

బీమా వర్తింపజేయండి

ఇల్లెందు: గుండెపోటుతో మృతి చెందిన కాంట్రాక్ట్ కార్మికుడు ప్రసాద్ కుటుంబానికి బీమా వర్తింపజేయాలని ఇఫ్టూ డిమాండ్ చేసింది. గురువారం ఇల్లెందులో జరిగిన ఇఫ్టూ సమావేశంలో యాకుబ్‌షావలీ, ఈసం శంకర్ మాట్లాడుతూ.. సీఎం, డిప్యూటీ సీఎం గతంలో ప్రకటించిన విధంగా కాంట్రాక్ట్ కార్మికులకు కూడా బీమా వర్తింపజేయాలని కోరారు. సోలార్ కార్మికుల సమస్యలపై సింగరేణి యాజమాన్యంతో హైదరాబాద్‌లో చర్చలు ఉన్నట్లు తెలిపారు. అనంతరం సోలార్ కార్మికుల కమిటీ అధ్యక్షుడిగా బాలు, ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్, కార్యదర్శిగా గణేష్, సహాయ కార్యదర్శిగా ఆంజనేయులు, దశసింగ్, గాంధీలను ఎన్నుకున్నారు.

మళ్లీ పార్టీ మారిన 'లక్కినేని'



లక్కినేనికి కండువా కప్పుతున్న కేటీఆర్

టేకులపల్లి: మండలంలోని బేతంపూడి పీఏసీఎస్ చైర్మన్ లక్కినేని సురేందర్‌రావు మళ్లీ పార్టీ మారారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయాన కాంగ్రెస్‌లో ఉన్న ఆయన కొత్తగూడెం టికెట్ ఆశించినా ఫలితం లేక బీజేపీ కండువా కప్పుకున్నారు. ఆ ఎన్నికల్లో బీజేపీ, జనసేన జత కట్టడంతో జనసేన పార్టీలో చేరి కొత్తగూడెం స్థానం నుంచి పోటీ చేశారు. అనంతరం స్తబ్దుగా ఉన్న సురేందర్‌రావు మాజీ ఎమ్మెల్యే హరిప్రియ, ఎంపీ మాలోతు కవిత ఆధ్వర్యాన హైదరాబాద్‌లో మాజీ మంత్రి కేటీఆర్ సమక్షాన గురువారం బీఆర్ఎస్‌లో చేరారు. అయితే, కాంగ్రెస్‌లో చేరక ముందు కొన్నాళ్లు బీఆర్ఎస్‌లో ఆయన కొనసాగారు. మొత్తంగా తొలినాళ్లలో మొదట్లో టీడీపీ, ఆ తర్వాత పీఆర్పీ, బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ, జనసేనల్లో కొనసాగిన లక్కినేని ఇప్పుడు మళ్లీ 'గులాబీ'గూటికి చేరారు.

చెక్ డ్యాం నిర్మాణం నిలిపివేయండి

సుజాతనగర్: ఎదుళ్లవాగుపై నిర్మించ తలపెట్టిన చెక్‌డ్యాం నిర్మాణాన్ని తక్షణమే నిలిపివేయాలని బీజేపీ జిల్లా నాయకులు ఆకుల నాగేశ్వరరావు గౌడ్ డిమాండ్ చేశారు. చెక్ డ్యాం నిర్మించే ప్రాంతాన్ని వరుసగా రెండో రోజు గురువారం రైతులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రైతుల అనుమతి తీసుకోకుండా అధికారులు పనులు నిర్వహించడం సరికాదన్నారు. తన అనుమతి తీసుకోకుండా తన పట్టాభూమిలో సైతం తవ్వకాలు చేపట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఇక్కడ చెక్ డ్యాం నిర్మాణం జరిగితే సుమారు 200 ఎకరాల్లో పంటలు ముంపునకు గురవుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. నిర్మాణం పూర్తయిన తరువాత డ్యాంలోని నీటి కారణంగా రైతులు ఇబ్బంది పడే పరిస్థితి ఉంటుందన్నారు. పొలాల్లోకి వెళ్లేందుకు దారి లేక రైతులు ఇబ్బంది పడతారని చెప్పారు. నిర్మాణాన్ని నిలిపివేయాలని కోరుతూ కలెక్టర్‌ను కలుస్తామని, అప్పటికీ సమస్య పరిష్కారం కాకపోతే పార్టీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో రైతులు కొండె కృష్ణ, గుర్రం పెరుమాళ్లు, వెంకటేశ్వర్లు, వినీల్ తదితరులు పాల్గొన్నారు.



చెక్ డ్యాం కోసం చేపట్టిన తవ్వకాలను చూపుతున్న రైతులు

శ్రీధర్మశాస్తా ఆలయం ఎదుట దీక్ష



దీక్షలో కూర్చున్న కృష్ణమూర్తి తదితరులు

కొత్తగూడెంటౌన్: సింగరేణి సంస్థ భవనాలను నిర్మిస్తున్న క్రమంలో ఆలయం ఎదుట ఉన్న రోడ్డును తగ్గించారని, తక్షణమే రోడ్డును తగ్గించకుండా నిర్మాణాలు చేపట్టాలని ఆలయ కార్యదర్శి కన్నెగంటి కృష్ణమూర్తి నిరవధిక నిరాహార దీక్షను చేపట్టారు. గురువారం కొత్తగూడెం రైటర్‌బస్తీలోని శ్రీధర్మశాస్తా ఆలయం ఎదుట దీక్షా స్థలంలో ఆయన మాట్లాడారు. పార్కింగ్‌కు ఇబ్బందులు కలుగుతాయని, పార్కింగ్ స్థలం వదిలి నిర్మాణాలు చేపట్టాలని సింగరేణి అధికారులకు చెప్పినా పట్టించుకోకుండా నిర్మాణాలు చేస్తున్నట్లు చెప్పారు. ఈ నిర్మాణాలను నిరసిస్తూ దీక్ష చేస్తున్నట్లు పేర్కొన్నారు. శ్రీధర్మశాస్తా ఆలయం ఎదురుగా ఉన్న రోడ్డు 27 అడుగులు ఉండగా దాన్ని 22 అడుగులకు కుదించి మాకు పార్కింగ్ లేకుండా చేశారన్నారు. కృష్ణమూర్తికి పలువురు అయ్యప్ప భక్తులు సంఘీభావం తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పార్కింగ్ సమస్యను పరిష్కరించాలని కోరారు. వర్ధన్‌రావు, ప్రకాష్, వేణు, చంద్రశేఖర్, సత్యనారాయణ, విజయ్, తిరుపతిరావు, వెంకటరామయ్య, శ్రీను, రమణ, మల్లికార్జున్, సత్యభామ, అరుణ, విజయ, చైతన్య, పరమేశ్వరి, భూదేవి, రవి తదిరులు పాల్గొన్నారు.

చట్టానికి లోబడి ఉండాలి..



మాట్లాడుతున్న జడ్జి కీర్తి చంద్రికారెడ్డి

ఇల్లెందు: రాజ్యాంగంలో పౌరులకు సమాన హక్కులు, విధులు ఉన్నాయని, అంతా చట్టానికి లోబడి ఉండాలని ఇల్లెందు కోర్టు న్యాయమూర్తి డి.కీర్తిచంద్రికారెడ్డి అన్నారు. గురువారం కోర్టు వెలుపల జరిగిన న్యాయ చైతన్య సదస్సులో ఆమె మాట్లాడారు. ఒక మహిళను అరెస్టు చేసే ముందు ఆమెకు కేసు వివరాలు తెలియజేయాలని సూచించారు. సాయంత్రం ఆరు గంటల తర్వాత స్త్రీలను అరెస్టు చేయరాదన్నారు. చేయాల్సి వస్తే మహిళా పోలీస్‌స్టేషన్‌కు తరలించాలన్నారు. ఈ సదస్సులో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.రవికుమార్, న్యాయవాదులు ఉమామహేశ్వరరావు, సత్యప్రకాష్, జయప్రకాష్, బన్సీలాల్ తదితరులు ఉన్నారు.

ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందాం..



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

టేకులపల్లి: మనువాద ఫాసిజానికి వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహించి ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతీఒక్కరిపై ఉందని తెలంగాణ ప్రజా ఫ్రంట్ రాష్ట్ర కోకన్వీనర్ మంతెన సంజీవరావు, జిల్లా నాయకుడు లక్ష్మీ, ఎట్టి ప్రశాంతి పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం మండల కేంద్రంలో మనువాద వ్యతిరేక సదస్సుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. మాట్లాడుతూ... దేశంలో మోదీ ప్రభుత్వం అత్యంత ఫాసిస్టు పాలన కొనసాగిస్తూ ప్రజల మధ్య అంతరాలు సృష్టిస్తోందని విమర్శించారు. దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టే విధంగా మోదీ ప్రభుత్వ నిర్ణయాలు ఉన్నాయని పేర్కొన్నారు. మూడోసారి అధికారంలోకి వస్తే భారత రాజ్యాంగాన్ని సైతం మారుస్తామని బాహాటంగానే బీజేపీ నేతలు చెప్తున్న తీరు ఆక్షేపణీయమన్నారు. బీజేపీ వస్తే పేద ప్రజల మనుగడ కష్టంగా మారుతుందని, స్వేచ్ఛా వాతావరణం లేకుండా అత్యంత ప్రమాదకరమైన పరిస్థితులు వస్తాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఎన్నికల్లో మోదీ ప్రభుత్వాన్ని గద్దె దింపాల్సిన బాధ్యత భారతదేశ ప్రగతిశీల శక్తులపై ఉందని పేర్కొన్నారు. ఈ క్రమంలో 28న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మనువాద ఫాసిజానికి వ్యతిరేకంగా జరిగే సదస్సును విజయవంతం చేయాలని కోరారు.

శ్రీషిర్డీ సాయిబాబాకు క్షీరాభిషేకం

పాల్వంచరూరల్: లక్ష్మీదేవిపల్లిలోని శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో గురువారం అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, క్షీరాభిషేకం నిర్వహించారు. టీఎస్ఆర్ ట్రస్ట్ చైర్మన్ తాండ్ర వెంకటేశ్వరరావు, ట్రస్ట్ ఆర్గనైజర్ నరాటి ప్రసాద్ స్వామి వారిని సందర్శించగా.. అర్చకులు స్వామి వారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి శేషవస్త్ర ప్రసాదాలను వారికి అందజేశారు.



బాబాను దర్శించుకుంటున్న వెంకటేశ్వరరావు

తాగునీటి బోర్లకు శంకుస్థాపన

పాల్వంచ: పట్టణంలోని హమాలీ, వనమా కాలనీల్లో తాగునీటి ఇబ్బందుల దృష్ట్యా టీఎస్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ చైర్మన్ తాండ్ర వెంకటేశ్వరరావు మంచినీటి బోర్లకు గురువారం శంకుస్థాపన చేశారు. కాలనీవాసులు అయితా గంగాధర్‌రావు, నరాటి ప్రసాద్, కోరె కృష్ణ, గణేశ్, రవి, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

రామమందిర పోస్టల్ స్టాంపులు ఆవిష్కరణ



స్టాంపులను ఆవిష్కరిస్తున్న పోస్టల్ ఉద్యోగులు

కొత్తగూడెంఅర్బన్: అయోధ్య రామమందిర ఘట్టాలను భారత ప్రభుత్వం పోస్టల్ స్టాంప్ రూపంలో అందుబాటులోకి తెచ్చిందని కొత్తగూడెం పోస్టు మాస్టర్ సంతోష్‌కుమార్ తెలిపారు. గురువారం పోస్టాఫీసులో పోస్టల్ స్టాంపులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... అయోధ్యలో రామమందిర నిర్మాణం తర్వాత భారత ప్రభుత్వ పోస్టల్‌శాఖ వారు రామ జన్మభూమి పేరు మీదుగా సాక్షాత్తు అయోధ్యలో రామమందిర నిర్మాణం నమూనాలను పోస్టల్ స్టాంపుల రూపంలో తయారు చేశారని పేర్కొన్నారు.

ఈ స్టాంపులో రామాయణంలోని అనేక ఘట్టాలు, ఇతివృత్తాలు ఉన్నాయని వివరించారు. శ్రీరామ నవమి సందర్భంగా ప్రత్యేకమైన స్టాంపులు కొత్తగూడెం హెడ్ పోస్టాఫీస్‌లో అందుబాటులో ఉంచామన్నారు. ఒక షీటు ఖరీదు రూ.100. కావాల్సినవారు హెడ్ పోస్టాఫీస్‌లో సంప్రదించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది సంతోష్‌కుమార్, వీరన్న, శివకుమార్, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

దర్గాలో శ్రీరామ మహాపట్టాభిషేకం

- రాజాధిరాజుగా పంచాయుధాలతో రామయ్య దర్శనం
- పులకించిన భక్తజనం.. రామనామంతో జయజయధ్వానాలు
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



పట్టాభిరామునికి పూజ చేస్తున్న దర్గా మాలిక్ లక్ష్మీనారాయణ

ఇల్లెందురూరల్: కల్యాణ రాముడు భక్తుల జయజయ ధ్వానాల నడుమ గురువారం పట్టాభిశక్తుడయ్యారు. ఈ అపూరుప వేడుకకు వేదికైన హజరత్ నాగుల్‌మీరా దర్గా మౌలాచాన్ చిల్లా ప్రాంగణం మురిసిపోయింది. వేదపిండితుల మంత్రోచ్చారణలు, జైశ్రీరాం నినాదాల నడుమ ఈ మహోన్నత ఘట్టం కనుల పండువగా జరిగింది. మండలంలోని సత్యనారాయణపురం గ్రామ శివారులో కొలువుదీరిన హజరత్ నాగుల్‌మీరా దర్గా మౌలాచాన్ చిల్లాలో బుధవారం సీతారాముల కల్యాణ వేడుకను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గురువారం వేదమంత్రోచ్చారణల నడుమ కల్యాణ రాముని పట్టాభిషేక మహోత్సవం నిర్వహించారు.

పంచాయుధాలతో పట్టాభిషేకం...

కల్యాణ రాముడిని రాజాధిరాజుగా పట్టాభిషికుడిని చేయడం ప్రతీచోట జరుగుతుంది. కానీ హజరత్ నాగుల్‌మీరా దర్గాలో ఎక్కడా లేనివిధంగా పంచాయుధాలతో శ్రీరాముని పట్టాభిషేకం అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేడుకను ప్రత్యక్షంగా తిలికిస్తున్నామా అన్న చందంగా భక్తులు మైమరిచిపోయేలా వైదిక పెద్దలు వేదమంత్రోచ్చారణలతో శ్రీరాముడికి కిరీటధారణ చేసి పంచాయుధాలైన సుదర్శన చక్రం, శంకు, గద, ఖడ్గం, ధనస్సులతో అలంకరించారు. సీతాసమేతంగా పంచాయుధాలతో పట్టాభిషిక్తుడైన రాజాధిరాజు శ్రీరామచంద్రమూర్తిని చూసిన భక్తులు పులకించిపోయారు.

నైవేద్యంగా దమ్మక్క వారసుల పిండివంటలు...

శ్రీరామచంద్రమూర్తి పట్టాభిషేక మహోత్సవం సందర్భంగా రామభక్తురాలు దమ్మక్క వారసులు సత్యనారాయణపురం గ్రామంలో గిరిజన సంప్రదాయ పద్ధతిలో నైవేద్యంగా పిండివంటలను స్వయంగా తయారు చేసి తీసుకొచ్చారు. మరికొందరు తాటి ముంజలు, నేతి అరిసెలు, ఉలవలు, గుగ్గిళ్ల తదితరాలతోపాటు ఫలాలు, పూలను రాముడి సన్నిధికి చేర్చి తరించారు.

భారీగా తరలివచ్చిన భక్తులు...

శ్రీరామచంద్రమూర్తి మహాపట్టాభిషేకాన్ని తిలకించేందుకు హజరత్ నాగుల్‌మీరా దర్గా మౌలాచాన్ చిల్లా ప్రాంగణానికి భక్తులు భారీ సంఖ్యలతో తరలివచ్చారు. చలువపందిరి నీడలో సుమారు మూడు గంటలపాటు సాగిన మహావేడుకను కనులారా వీక్షించి తరించారు. వేడుక కొనసాగుతున్నంత సేపు భక్తులు రామనామ జపంతో జయజయ ధ్వానాలు చేశారు. అనంతరం దర్గా కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.


అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు..

శ్రీరామచంద్రమూర్తి మహా పట్టాభిషేకం సందర్భంగా దర్గా ప్రతినిధులు ప్రత్యేకంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పలువురు యువతులు భక్తిగీతాలతో చేసిన భరతనాట్యం, కూచుపూడి నృత్య ప్రదర్శనలతో అలరించారు.

మతసామరస్యానికి ప్రతీక: న్యాయమూర్తి కీర్తి చంద్రికారెడ్డి

ప్రజలలో భక్తిభావాన్ని పెంపొందిస్తూ మండలంలోని హజరత్ నాగుల్‌మీరా దర్గా మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తోందని ఇల్లెందు న్యాయమూర్తి కీర్తిచంద్రికా రెడ్డి అన్నారు. శ్రీరామచంద్రమూర్తి మహాపట్టాభిషేకానికి స్వయంగా తిలకించి ప్రత్యేక పూజ చేశారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. భారతదేశం సర్వమత సమ్మేళనం అని గొప్పగా చెప్పుకుంటున్న మనం హజరత్ నాగుల్‌మీరా దర్గాలో ఆ దృశ్యాన్ని ప్రత్యక్షంగా చూస్తున్నామన్నారు. దర్గాలో సీతారాముల కల్యాణం, శ్రీరాముని పట్టాభిషేకం నిర్వహించడం హర్షణీయమన్నారు.





పూజ చేస్తున్న న్యాయమూర్తి కీర్తి చంద్రికారెడ్డి, స్వామికి పండ్లు, నైవేద్యం సమర్పిస్తున్న దృశ్యం





యువతుల నృత్య ప్రదర్శన